క్లుప్తంగా

జీవితం సప్తవర్ణాల శోభితం కావాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ):హోలీ పండుగ సందర్భంగా తండా నాయకుడు మురళీ నాయక్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు సోమవారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయానికి వచ్చి పశ్చిమ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసిఫ్‌కు హోలీ శుభాకంక్షలు తెలియ చేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ హోలీ పండుగను పురస్కరించుకుని సరదాగా చల్లుకునే రంగుల మాదిరిగా జీవితం సప్తవర్ణాల శోభితం కావాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అన్నారు. ప్రతి పండుగకు ఆచారాలు, సంప్రదాయాలు ముఖ్యమైనవని, హోలీ కూడా అందులో భాగమేనని పేర్కొన్నారు. అయితే ఇది ఇతరులకు ఇబ్బందికరంగా, దుస్సంప్రదాయంగా మారకూడదన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి గ్రామంలో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కొత్తపేట సీఐ గణేష్ ఎన్నికల నియమావళి, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించడంపై అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా ఉండాలని, రాజకీయ పార్టీలు ఇచ్చే కానుకలను వారికి తిప్పి పంపాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఎవరైనా వివాదాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామలింగేశ్వర స్వామికి వెండి వింజామరాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్లకు సోమవారం భక్తులు వెండి వింజామరాలను కానుకగా సమర్పించారు. వన్‌టౌన్‌కు చెందిన ఉద్దంటి శేషగిరిరావు, రత్నం దంపతులు స్వామి వారికి అందచేశారు. సోమవారం ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చన, విశేష అలంకరణ అనంతరం వింజామరాలతో సేవ జరిగింది. అనంతరం స్వామి వారికి ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో లలితా సహస్ర నామ పారాయణ జరిగింది.

వైభవంగా లక్ష్మీ జయంతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో లక్ష్మీ జయంతి కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లక్ష్మీజయంతిని పురస్కరించుకొని పద్మావతి అమ్మవారి మూలమూర్తికి ఫలపుష్ప, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అర్చక స్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. కొత్తగుళ్ళు ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానంలో రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు.

కేఎల్‌యూ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఈ నెల 27, 28 తేదీల్లో కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవం ఆత్రోవ్ -2024ను పురస్కరించుకుని విద్యార్థులు సోమవారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్ మాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ ప్రతినిధి బి.శివనాగయ్య మాట్లాడుతూ యువజనోత్సవాల్లో మాక్ పార్లమెంటు, క్విజ్, దేశీయ, పాశ్చాత్య నృత్యం, సంగీతం, సాంకేతిక, సాహిత్య, చిత్రలేఖనం, డీజే నైట్ వంటి అనేక అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.అనిల్‌కుమార్, ఆర్. సాయికుమార్, జి.వెంకటేశ్వర్లు, విద్యార్థి కో ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా జగనన్న ప్రభుత్వం



వస్త్రలతలో వ్యాపారులతో మాట్లాడుతున్న ఆసిఫ్ తదితరులు



అసోసియేషన్ కార్యాలయంలో వ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న ఆసిఫ్

పాతబస్తీలో పర్యటించిన షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వ్యాపార వర్గాలకు జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీ 37వ డివిజన్ పరిధిలోని కాళేశ్వరరావు మార్కెట్ వస్త్రలత వద్ద స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, పార్టీ నాయకులతో కలిసి ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వస్త్ర వ్యాపారులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వోలేటి జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు జీకేఆర్ నాగభూషణరావు, మద్ది సుబ్బారావు తదితరులతో ప్రత్యేకంగా సమావేశమై వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం, నగర పాలక సంస్థ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, ప్రతి సమస్యా పరిష్కరిస్తామని అసోసియేషన్ నేతలకు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. పేదలు ఆకలితో అల్లాడకుండా ఆత్మగౌరవంతో జీవించగలిగారని, వ్యాపారాలు పూర్తిగా దెబ్బతినకుండా కాపాడారని చెప్పారు. రెండు నెలలుగా గడపగడపకూ వెళ్లి ప్రజలను కలిశామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన పట్ల సంతోషంగా ఉన్నట్లు చెప్పారని వివరించారు. పశ్చిమ నియోజకవర్గాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, స్థానిక డివిజన్ అధ్యక్షుడు గ్రంధి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ అజెండా

- కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా
- 38వ డివిజన్‌లో పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్ కుమారుడు, కుమార్తె పర్యటన




38వ డివిజన్‌లో పర్యటిస్తున్న రెహమతున్నీసా, చైతన్యరెడ్డి, షేక్ జావేద్, రేష్మా తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా అన్ని వర్గాలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడే అందరికీ మంచి జరుగుతుందని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా అన్నారు. డివిజన్ పరిధిలోని విద్యాధరపురం కరకట్ట ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఆమె పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ కుమారుడు షేక్ జావిద్, కుమార్తె రేష్మాతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరిగి అపరిష్కృతంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల పక్షపాతి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ నియోజకవర్గానికి మైనార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను పోటీలో నిలబెట్టారని, ఆయన్ని అత్యధిక మెజారీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందించాలని కోరారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్‌ఆర్ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి మించి మైనార్టీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేశారని తెలిపారు. ముస్లిం మైనార్టీలకు ఇంతగా మేలు చేసిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

పిలిస్తే పలికే ఆసిఫ్‌ను గెలిపించండి....

నియోజకవర్గంలోనే ఉంటూ పిలిస్తే పలికే పశ్చిమ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, తమ తండ్రి షేక్ ఆసిఫ్‌ను గెలిపించాలని ఆయన కుమారుడు షేక్ జావిద్, కుమార్తె రేష్మా విజ్ఞప్తి చేశారు. పార్టీ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రానున్న ఎన్నికల్లో పశ్చిమ అభ్యర్థి స్థాయి వరకు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం రుణపడి ఉంటుందని చెప్పారు.

ప్రజాప్రతినిధులంటే అంటే అధికారం కాదని, ప్రజాసేవకులని సీఎం జగనన్న అన్న మాటలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సేవకే అంకితం అవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి, ఆరెకటిక, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు బీ మంజు, మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నీలవేణి, ఎస్‌కె నీలోఫర్, ఎస్‌కె బాషా, ఎస్‌కె ఇర్ఫాన్, కరిముల్లా, ఎస్‌కె ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



సంధ్యా సమయాన..

సాయం సంధ్యవేళ భానుడు అస్తమిస్తున్న తరుణంలో వెలువడే ఎర్రటి సూర్య కిరణాలు కృష్ణానదిపై ప్రసరిస్తున్నప్పుడు నాటు పడవపై చేపలు వేటాడుతున్న మత్స్యకారుడి చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సందేశాత్మక చిత్రం సింహధ్వని

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమ మార్గంలో నడిపే సందేశాత్మక చిత్రంగా సింహధ్వని తెరకెక్కిందని చిత్ర నిర్మాత ఎస్.ఎస్.స్వామి అన్నారు. చిత్రం ఏప్రిల్ నెలలో విడుదల కానుందని, ప్రతి ఒక్కరూ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. లక్ష్మీ భవాని ఫిల్మ్స్ బ్యానర్ పై రూపొందించిన సింహధ్వని చిత్ర ఆడియో ఫంక్షన్‌ను బందర్‌రోడ్డులోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హీరో వశిష్ట, హీరోయిన్ త్రివేణి పావని, చిత్ర నిర్మాత ఎస్.ఎస్.స్వామి, నటులు నిడదవోలు శ్రీనివాసరావు, ఏలూరు రాంబాబు, నవరంగ్ థియేటర్ అధినేత భూపాల్ ప్రసాద్ పాల్గొని ఆడియోను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత స్వామి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత గంజాయి మత్తు పదార్థాలకు ఏ విధంగా బానిసలు అవుతున్నారో, ఆ పరిస్థితులను కథానాయకుడు ఎలా అధిగమించాడో తెలిపేదే సింహధ్వని చిత్రమని పేర్కొన్నారు. యువతను పెడదారి పట్టకుండా అవగాహన కల్పించే మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రమన్నారు. ప్రేక్షకులందరూ తప్పక చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని కోరారు. నటినటులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చిత్రాన్ని తీసుకొచ్చామని, మంచి మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రమని తెలిపారు. తమ సింహధ్వాని చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు.

మద్యం పట్టివేత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):అక్రమంగా విక్రయిస్తున్న బీర్, మద్యం బాటిల్స్‌ను కొత్తపేట పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని యువకుడిని అరెస్టు చేశారు. కొత్తపేట సెక్టార్ ఎస్ఐ జి. రాజనరేంద్ర సోమవారం ఉదయం గస్తీ నిర్వహిస్తుండగా, శ్రీనివాసమహల్ వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. కొండ ప్రాంతానికి చెందిన పిల్లి శివసాయిగా గుర్తించి తనిఖీ చేశారు. సంచిలో 12 బీర్ బాటిల్స్, 6 మద్యం బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రంగుల హోలీ..







విజయవాడ నగరంలో హోలీ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. వివిధ రకాల రంగు నీళ్లు ఒకరిపైనొకరు కొట్టుకుంటూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గురునానక్ కాలనీలో యువతీ యువకులు నృత్యాలు చేస్తూ రంగులు పూసుకుంటూ హోలీ పండుగ చేసుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



● ముమ్మరంగా తనిఖీలు



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఇతర శాఖలకు చెందిన ఎన్నికల అధికారులు నిఘా ముమ్మరం చేశారు. డబ్బు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా కాకుండా నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల అధికారులు సోమవారం విజయవాడలోని బీఆర్‌టీఎస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పూర్వ విద్యార్థుల సేవలు అపూర్వం



చెక్కులందిస్తున్న తొమ్మండ్రు శేషయ్య తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కళాశాల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అపూర్వమని కాకరపర్తి భావనారాయణ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలోని విథ్రిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలను సోమవారం కమిటీ ప్రముఖులు, హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్ తదితరుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థులు విథ్రిన్ ఫౌండేషన్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి గడిచిన ఎనిమిది సంవత్సరాలుగా సమాజానికి సేవలందించటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలోని విద్యార్థులతో కలిసి ఈ సంస్థను ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు. తమ కళాశాల విద్యార్థులకే ఏటా రెండున్నర లక్షల వరకూ సాయమందించటం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పృథ్వీ, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి వేళ ఆర్జిత సేవలకు డిమాండ్



చండీ హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఫాల్గుణ పౌర్ణమి వేళ ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల సన్నిధిలో నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కళ్యాణంతో పాటు సాయంత్రం పంచహారతుల సేవలో విశేషంగా పాల్గొన్నారు. పౌర్ణమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌ను స్వర్ణకవచంతో అలంకరించారు. చండీ హోమం, లక్ష కుంకుమార్చనలు పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొనడంతో రద్దీ అధికంగా కనిపించింది. మరో వైపున ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

మేడే రచనల పోటీలకు ఆహ్వానం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మేడే సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనల పోటీ నిర్వహిస్తున్నట్లు జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యుడు గుండు నారాయణరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ అభివృద్ధిలో అసమానతలు, దోపిడీ, వివక్ష సామాజిక సంక్షోభం తదితర అంశాలను ఇతివృత్త కేంద్రంగా తీసుకొని రచయితలు తమ రచనలు పంపాలన్నారు. కథలు, కవితలు, పాటలు, వ్యాసాల ప్రక్రియల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. రచనలను ఏప్రిల్ 20వ తేదీలోగా మెయిల్ ద్వారా మాత్రమే పంపాలని కోరారు.

ఒక్కో విభాగంలో బహుమతులు...

ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున, అలాగే ప్రతి విభాగంలో రూ.1000 చొప్పున రెండు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. రచనల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి మే 5వ తేదీన విజయవాడలో జరిగే సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వరప్రసాద్, శాంతిశ్రీ, ఉషారాణి, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, అరసం కార్యదర్శి పరుచూరి అజయ్, కవి, రచయిత గద్దం విజయరావు, కె.లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిహర అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం పంచామృతాలతో అభిషేకాలు, అర్చన, విశేష అలంకరణ జరిగాయి. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావుశర్మ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీహరిహర అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. విశేష పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణను చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. కార్తీక మాసంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం నిర్వహించేందుకు అవసరమైన వంట సామగ్రిని దాత కుంచం శ్రీనివాసరావు సేవా సమితికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కుంచం శ్రీనివాసరావును కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, కరెంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.